
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

గురువారం 28 నవంబరు 2024

అమ్మో... చలి!

రంగారెడ్డి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాను చలి వణికిస్తోంది. కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం పది గంటలైనా చలి తీవ్రత తగ్గడం లేదు. చల్లని గాలులకు జనం బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో 10.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం మండలం కాసులబాద్‌లో 10.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్- మల్కాజిరిగి జిల్లా మూడుచింతలపల్లిలో 12.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రోడ్డుపైనే మురుగు

కల్వర్టుకు అడ్డంగా రాళ్లు

మ్యాన్‌హోల్ నుంచి బయటకు మురుగు

ఇబ్బందుల్లో వాహనదారులు, స్థానికులు

పట్టించుకోని అధికారులు, పాలకులు



8

వేరుశనగ వైపు.. రైతన్న చూపు

ఆశలు రేకెత్తిస్తున్న శనగ పంట

యాసంగిలో పెరిగిన సాగు విస్తీర్ణం

ఆరుతడి పంటల సాగుపై

వ్యవసాయ అధికారుల సూచనలు



7

అభివృద్ధికి సహకరించాలి

సీఎస్ఆర్ నిధులు సకాలంలో అందించండి

ఆరోగ్యం, విద్యకు తోడ్పాటునివ్వాలి

ప్రముఖ పారిశ్రామిక వేత్తలకు

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచన



7

రేపటి నుంచి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



మాట్లాడుతున్న డీఈవో సుశీందర్‌రావు

శంషాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ(అమ్మపల్లి)లోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు డీఈఓ పి.సుశీందర్‌రావు తెలిపారు. బుధవారం పాఠశాలలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం కోసం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆత్మీయ అతిథులుగా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి విచ్చేయనున్నట్లు చెప్పారు. ముగింపు కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 400 నుంచి 500 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 1200 మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రదర్శనలో పాల్గొనే వారికి వసతి, భోజనం, ఇతర సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, సరూర్‌నగర్ ఎంఈవో కృష్ణ, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, మాజీ ఎంఈవో రాంరెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమాదేవి పాల్గొన్నారు.

సర్వే‌త్రా నిరీక్షణ!

గట్టు తగాదాలు తీరాలన్నా.. భూ వివాదాలకు చెక్ పడాలన్నా.. శిఖం పంచాయతీలు తీరాలన్నా.. ఆక్రమణల నిగ్గు తేల్చాలన్నా.. భూసేకరణ చేపట్టాలన్నా అన్నింటికీ సర్వరోగ నివారణ భూ సర్వే. అయితే జిల్లాలో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. ఈ పోస్టులు చాలావరకు ఖాళీగా దర్శనమిస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. భూ వివాదాలతో గొడవలు పడి రెవెన్యూ, పోలీసులను ఆశ్రయిస్తున్నారు. భూముల కొలతల కోసం దరఖాస్తు చేసుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వేయర్లు అందుబాటులో లేక భూ సమస్యల దరఖాస్తులు కుప్పలుగా పేరుకుపోతున్నాయి.



జిల్లాలో వేధిస్తున్న సర్వేయర్ల కొరత

సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్ పోస్టులు ఖాళీ

రెండు మండలాలకు ఒక్కరే..

ఉన్న సిబ్బందిపై పెరిగిన పని భారం

చేయి తడిపితేనే పని.. లేదంటే కొర్రీలు

పరిష్కారానికి నోచని భూ వివాదాలు

కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

రైతన్నలకు భూ సర్వే కష్టాలు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొలతల సార్ల కొరత ఏర్పడింది. ఫలితంగా భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తుల సంఖ్య పేరుకుపోతుంది. సర్వే ల్యాండ్ రికార్డ్ విభాగంలో పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీలు ఉన్నాయి. కీలకమైన సర్వేయర్లతో పాటు డిప్యూటీ సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో సరిహద్దు పంచాయితీలు తెగడం లేదు. భూ వివాదాలు కొలిక్కిరావడం లేదు. భూ సర్వే కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సర్వే కోసం రుసుము చెల్లించి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులిచ్చిన వారి భూముల సర్వేకు మాత్రమే వెళ్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 27 మండలాలు ఉండగా జిల్లా కేంద్రం మినహాయించి మండలానికి ఒకరు చొప్పున సర్వేయర్‌ను నియమించాల్సి ఉంది. 27 మండలాలకు 14 మంది సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు ఉన్నారు. ఒక్కో సర్వేయర్‌కు రెండు మండలాలను అప్పగించారు. సర్వేయర్ల కొరత కారణంగా ఐకేపీలో పనిచేస్తున్న ముగ్గురిని సర్వేయర్లుగా విధుల్లోకి తీసుకున్నారు. కందుకూరు, మంచాల, మొయినాబాద్ మండలాల్లో ఐకేపీలో

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో 601 రెవెన్యూ గ్రామాల పరిధిలో 575 విలేజ్ మ్యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 545 మ్యాప్‌లను పరిశీలించి, వాటిని ధరణిలో నమోదు చేయించారు. ఏడు గ్రామాలకు సంబంధించిన మ్యాప్‌లు మిస్సయ్యాయి.

14 గ్రామాలకు నో సేత్వార్..!

మొత్తం జిల్లాలో 1,67,550 సర్వేనెంబర్లు, 1,12,858 టిపాన్లు, 372 సేత్వార్లు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 14 గ్రామాల్లో సేత్వార్లు లేవు. ఈ గ్రామాల్లో రీ సర్వే చేశారు. కానీ.. అమలు కాలేదు. వందేళ్ల సర్వే రికార్డులు అందుబాటులో ఉన్నాయి.

సర్వేయర్ల వివరాలు

ఉండాల్సిన సర్వేయర్లు	ఉన్న సర్వేయర్లు
27	14
ఖాళీలు 13	

జిల్లా సర్వే కార్యాలయంలో..

ఉండాల్సిన సిబ్బంది	ప్రస్తుతం ఉన్నవారు
30	18
ఖాళీలు 12	

వచ్చిన దరఖాస్తులు	2,688
పరిష్కరించినవి	448
పెండింగ్‌లో ఉన్నవి	2,240

జిల్లాలో నేడు

కార్తీక కోటి దీపోత్సవం

షాద్‌నగర్‌రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గురువారం నుంచి శనివారం వరకు కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సింగారం సరళ శ్రీనివాస్, సింగారం వాణి యాదగిరి నివాస్ తెలిపారు. ఛత్రపతి శివాజీ సాంస్కృతిక సంస్థ, మాతా టెంట్ హౌజ్, సంస్కార భారతి సహకారంతో పట్టణంలోని హాజిపల్లి రోడ్డులోని గౌరి గార్డెన్ ఎదురుగా ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీపోత్సవంలో మాతా మాణికేశ్వరి శిష్యులు ఆచార్య గౌరయ్య స్వామి, ఆనందాచార్యులు, శివానంద స్వామి తమ సందేశాలను వినిపిస్తారని తెలిపారు.

పాలమూరులో రైతు పండగ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో రైతు పండగ నిర్వహిస్తున్నట్లు డీఏఓ నర్సింహ్మారావు తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు ఏర్పాటుచేసిన 125 స్టాల్స్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని చెప్పారు. ఈ స్టాల్స్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన వివిధ రకాల ఆధునిక యంత్ర పరికరాలు, డ్రోన్లను ప్రదర్శిస్తారని చెప్పారు. రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా నుంచి 29వ తేదీన 35 ప్రత్యేక బస్సుల్లో 1,750 మంది రైతులు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలతో పంటలపై సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతయాని, రైతులందరూ వ్యవసాయశాఖ అధికారులతో సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మళ్లీ రంగంలోకి హైడ్రా!

ఫిర్యాదుల నేపథ్యంలో చెరువుల పరిశీలన

- గ్రేటర్‌తోపాటు శివార్లలోని చెరువుల సందర్శన
- ఆక్రమణలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చిన స్థానికులు
- షెడ్ల తొలగింపునకు రంగనాథ్ ఆదేశం
- చెరువులను కబ్జా చేస్తే విడిచి పెట్టబోమని హెచ్చరిక



నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా మరోసారి రంగంలోకి దిగింది. గ్రేటర్‌తోపాటు శివారు ప్రాంతాల్లోని పలు చెరువులను కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. నివాసేతర ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, వెంటనే తొలగించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి మాదాపూర్‌లోని ఖానామెట్ సర్వే నెంబర్ 7లో 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈదులకుంటను ఓ రియల్ ఎస్టేట్ సంస్థ మట్టితో పూడుస్తుందన్న ఫిర్యాదుతో అక్కడకు వెళ్లిన రంగనాథ్.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి ఈదులకుంటను పరిశీలిస్తానని, నిర్మాణదారుల వద్ద ఉన్న డాక్యుమెంట్లు, సర్వే నివేదికను పరిశీలిస్తానన్నారు. మాదాపూర్‌లోని మేడికుంటను కూడా ఆయన పరిశీలించారు. మెజార్టీ కుంట మాయమై ఇప్పటికే అక్కడ బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి.

ఇకపై చెరువులు కబ్జా కాకుండా నియంత్రిస్తాం

నిజాంపేటలోని తలాబ్ (తురక లేక్) చెరువు ఆక్రమణల వివరాలను స్థానికులు కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. చెరువుకు సంబంధించిన మ్యాపులు, డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. ఇదే చెరువు వద్ద నిజాంత ల్యాబ్‌ను కూడా పరిశీలించారు. కట్టకు ఆనుకుని ఉన్న షెడ్లను రెండు రోజుల్లో తొలగించాలని రెవెన్యూ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కట్టపైకి వెళ్లిన కమిషనర్ చెరువులోకి ఇన్‌లెట్ ద్వారా వస్తోన్న మురుగునీటిని చూసి చెరువంతా కలుషితమవుతుందని, మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో చెరువుకు సంబంధించి సమగ్ర సర్వే చేయాలన్నారు. బండారి లే అవుట్ కమ్యూనిటీ అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు చెరువును పూర్తిస్థాయిలో పరిశీలించారు. నార్సింగ్‌లోని నెక్నాంపూర్ చిన్న చెరువును పరిశీలించిన ఆయన బఫర్ జోన్‌లో నిర్మాణాల వివరాలు తెలుసుకున్నారు. గేటెడ్ కమ్యూనిటీలోని మురుగు నీరు నేరుగా వచ్చి చెరువులో చేరుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. తెల్లాపూర్‌లోని వనం, చెల్లికుంట, మేళ్ల చెరువులను ఆయన పరిశీలించారు. సుందరీకరణ పేరిట రియల్ కంపెనీలు కబ్జా చేస్తున్నాయని, చెరువులను పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. ఇక నుంచి చెరువులు కబ్జా కాకుండా నియంత్రిస్తామని, పునరుద్ధరణకూ అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, డాక్యుమెంట్లు, సర్వే నివేదికలను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలుంటాయని స్థానికులతో కమిషనర్ పేర్కొన్నారు.

జిల్లాకు కృష్ణా జలాలు

షాద్‌నగర్‌లో కోల్డ్‌స్టోరేజ్

కొందుర్గుకు నూతన మార్కెట్

ట్రిపుల్‌ఆర్‌తో బంగారం కానున్న భూములు

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పక్కన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/ షాద్‌నగర్ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సాగునీటిపై గత ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని, జిల్లాకు కృష్ణా జలాలను తీసుకువచ్చి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన బుధవారం షాద్‌నగర్ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణస్వీకారం జరిగింది. కమిటీ చైర్‌పర్సన్‌గా సులోచనకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్‌తో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరై నూతన కమిటీని అభినందించారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కోరినవన్నీ ఇస్తున్నామని మంత్రి తెలిపారు. శంకర్ కోరినట్లుగా కొందుర్గుకు నూతన వ్యవసాయ మార్కెట్‌ను, షాద్‌నగర్‌కు కోల్డ్‌స్టోరేజ్‌ను మంజూరు చేస్తానని చెప్పారు. ట్రిపుల్‌ఆర్ రోడ్డుతో షాద్‌నగర్ ప్రాంత భూములు సైతం బంగారం కాబోతున్నాయని అన్నారు. వరి సన్న ధాన్యానికి రూ.500 బోనస్‌ను ఇస్తున్నామని, రెండు లక్షల వరకు రుణ మాఫీని ఈనెల 30న ఇవ్వబోతున్నామని మంత్రి స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి పంటల బీమాను సైతం అమలు చేయబోతున్నామని అన్నారు. ఈనెల 30న పాలమూరులో నిర్వహిస్తున్న రైతు పండుగకు రైతులు అధిక సంఖ్యలో హాజరై సీఎంకు అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారికి పదవులు వస్తున్నాయని అన్నారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. పదవులు పొందినవారు కష్టపడి పనిచేసి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో మరో వ్యవసాయ మార్కెట్‌ను, షాద్‌నగర్‌లో కోల్డ్‌స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతులు పామాయిల్ తోటలను సాగుచేసి అధిక లాభాలు గడించాలని కోరారు. ఇందుకు ప్రభుత్వం సైతం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఈనెల 30న జరిగే రైతు పండుగలో ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి, రైతులు ఆర్థికంగా ఎదిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం షాద్‌నగర్‌లోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి సందర్శించారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బక్కని వేంకటేశ్వరుడికి మహా భక్తుడు అని అభినందించారు. అలాగే షాద్‌నగర్ పట్టణ శివారు చటాన్‌పల్లిలోని పౌల్ట్రీ ప్రాంతాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పౌల్ట్రీ రైతుల పన్ను బకాయిల రద్దును ఎత్తివేసేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, భీష్వ కిష్టయ్య, మార్కెట్ శాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్లనమోని యాదయ్య, సింగిల్ విండో చైర్మన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, అగ్గనూరి విశ్వం, ఏ. కృష్ణారెడ్డి, తాండ్ర కాశీనాథ్‌రెడ్డి, జి. బాల్‌రాజ్‌గౌడ్, జగదీశ్వర్, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, కె. చెన్నయ్య, అగ్గనూరి బస్వం పాల్గొన్నారు.





ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్‌పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మొయినాబాద్ రూరల్ : విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలోని స్వామి నారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో గురుకుల్-ఒలింపిక్ 2024 పేరిట మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆటల పోటీలను బుధవారం మంత్రి ప్రారంభించారు.స్వామి నారాయణ్ గురుకుల్ విద్యసంస్థలకు చెందిన స్వామిజీలతో పాటు ప్రిన్సిపాళ్లు ప్రవీన్ కుమార్, శేషు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగం



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : షాద్‌నగర్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అట్టహసంగా స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో పవిత్రోవాలలో భాగంగా హోమం, మహాపూర్ణాహుతి, పవిత్రారోహణ, హష్టోత్తర శతకలశాభిషేకం, పుష్పయాగం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు పవిత్ర మాలలు వేసి వేద బ్రాహ్మణులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, పారిశ్రామికవేత్తలు సురేంద్ర, జితేందర్ కేడియా, కౌన్సిలర్లు టి ప్రతాప్‌రెడ్డి, బచ్చలి నర్సింహ్మా, పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్ గుప్తా, పి.వెంకటసాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, బి.జగన్మోహన్‌రెడ్డి, పి.మోహన్‌రావు, చెంది మహేందర్‌రెడ్డి, ఈట గణేష్, కానుగు రాంభూపాల్, డి.వాసు తదితరులు పాల్గొన్నారు.



ఆశీర్వాదం

శంషాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి, రజిత దంపతుల కూతురు రుత్వికారెడ్డి వివాహం అభిజిత్‌రెడ్డితో బుధవారం జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ఏరీనాలో ఘనంగా జరిగింది. నూతన వధూవరులను గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ్మ, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యేలు, వ్యాపారవేత్తలు తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ప్లైవుడ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాదారంలో పవన్ ప్లైవుడ్ కంపెనీలో మృతి చెందిన కార్మికుడు మోహిత్‌కుమార్ కుటుంబానికి రూ.30 లక్షల పరిహారాన్ని అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం వారు కంపెనీని సందర్శించి కార్మికుడి మృతికి కారణాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన 80 మంది కార్మికులు ఈ కంపెనీలో పని చేస్తున్నట్లు గుర్తించామన్నారు. పాములు, పంది కొక్కుల మధ్య కార్మికులు నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టని కంపెనీ యజమాన్యంపై కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు

జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యదర్శి డీబీ శీతల్


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీబీ శీతల్

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ హెచ్చరించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ పెద్దలు, ఉపాధ్యాయులు సామాజిక సంస్థలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు జరుగుతున్న విషయాన్ని పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు వెంటనే తెలపాలన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పెళ్లి తర్వాత ఆ దంపతులు జీవితాలు అనేక సమస్యల మధ్య నడుస్తాయని వివరించారు. అందుకే సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి వివాహాలను నిరోధించడంలో తమ వంతు సహకారం అందించాలన్నారు. ఇతర ప్రాంతాలలో బాల్య వివాహాలు జరిగితే కూడా స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చి వారికి సాయం అందించాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కొడంగల్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దనందిగామ గ్రామంలో పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని నందికోల విన్యాసాలు, అడుగుల భజనల మధ్య ఊరేగిస్తూ ఆలయం వరకు తీసుకెళ్లారు. అనంతరం గోవు పూజ, గణపతి పూజ, హోమం, వివిధ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నేడు అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ ధ్యేయం.. సామాజిక న్యాయం

ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి


కాంగ్రెస్ నేతలతో చల్లా వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, సమానత్వమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో బుధవారం తుక్కుగూడ వద్ద ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సంపదను పెంచి సామాజిక వర్గాల వారీగా పంచి వారి ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బాటలు వేస్తుందన్నారు. కుల గణన ఫలితాల ఆధారంగానే ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని చెప్పారు. కుల గణన అంటే కేంద్రంలోని బీజేపీకి వణుకు పుడుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులంత సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ , డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి , నాయకులు కృష్ణ, రమేశ్, శ్రీను, కృష్ణనాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఇబ్బందులు రానీయొద్దు

» బాలసదనంలో సమస్యలను పరిష్కరిస్తాం
» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్


కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో మాట్లాడుతున్న లాల్‌కృష్ణప్రసాద్

పరిగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాలసదనంలో చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు రానీవ్వొద్దని, వారికి అవసరమైన కనీస వసతులు అన్ని కల్పించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం ఆయన పరిగి బాలసదనాన్ని సందర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంసపూర్తిగా ఉన్న భవనం గురించి ఆరా తీశారు. దాన్ని పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులు సమకూరుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్కడున్న సమస్యలను వెంటనే పరిష్కారిస్తామన్నారు. పిల్లలకు భోజనం కూడా నాణ్యతగా అందించాలని సూచించారు. బాలసదనంలో అందరూ తల్లిదండ్రులను కోల్పోయినవారే ఉంటారని, వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, సూపర్‌వైజర్లు నిర్మల తదితరులు పాల్గొనారు.

బీసీ హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి

బీసీ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ వినతిపత్రాన్ని అందజేశారు. వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిగిలో బీసీ బాలుర, అంతారంలో బీసీ హాస్టల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. కిటికీలు, తలుపులు లేక చలికి విద్యార్థులు గజగజ వణికిపోతున్నారని తెలిపారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. వెంటనే కనీస మరమ్మతులు చేయించాలని కలెక్టర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.


కళకళలాడుతున్న వేరుశనగ పంట

రైతన్న చూపు వేరుశనగ వైపు

యాసంగిలో పెరిగిన సాగు విస్తీర్ణం

» ఆరుతడి పంటల సాగుకు అధికారుల సూచన
» పెట్టుబడి ఎక్కువైనా లాభాలపై ఆశలు

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంట రైతుల్లో ఆశలు రేకిత్తిస్తోంది. ఆమనగల్లు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వందల ఎకరాల్లో వేరుశనగ పంట కళకళలాడుతోంది. ఆరుతడి నూనె గింజల పంటల్లో వేరుశనగకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం, 90 రోజుల్లో పంట చేతికి వస్తుండడంతో యాసంగిలో రైతులు ఆ పంట సాగుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడితో కూడుకున్నదే అయినా అధిక లాభాలు వస్తాయన్న ధీమాతో రైతులు మక్కువ కనబరుస్తున్నారు.

అధిక దిగుబడిపై ఆశలు

ఆమనగల్లు సబ్ డివిజన్‌లో వేరుశనగ పంట సాగుకు భూములు అనువైనవిగా ఉంటాయి. దీంతో ఏటా యాసంగిలో వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా వేరుశనగ సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు ఈ పంట సాగు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఆమనగల్లు సబ్‌డివిజన్ పరిధిలోని ఆమనగల్లులో 1,500ల ఎకరాలు, మాడ్గులలో 200, తలకొండపల్లిలో 2,300, కడ్తాలలో 120 ఎకరాలలో వేరుశన పంట ఈ ఏడాది సాగు చేశారు. వేరుశనగ విత్తనాలు రూ.13,500 నుంచి రూ.14 వేల వరకు రైతులు కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు.

ఊడల దశలో పంట

నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. రూ. 20 వేలు పెట్టుబడి అవుతుందని పేర్కొంటున్నారు. గతేడాది వేరుశనగ క్వింటాల్‌కు రూ.7 వేల వరకు ఉండడంతో ఈ ఏడాది రైతులు అధికంగా ఆసక్తి కనబరుస్తున్నారు. సెప్టెంబర్ నుంచి వేరుశనగ సాగు ప్రారంభమైంది. పత్తి పంట ముగియడంతో దాని స్థానంలో వేరుశనగనే సాగు చేస్తున్నారు. అక్కడక్కడ వేరుశనగకు తెగుళ్లు సోకినప్పటికీ ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల వేరుశనగ సాగు ప్రారంభించారు. పంట ప్రారంభ దశ(ఊడల దశ)లో ఉంది.

పది ఎకరాల్లో సాగుచేశా



యాసంగిలో ఆరుతడి పంటగా పది ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. ప్రస్తుతం పంట ఊడ దశలో ఉంది. కల్వకుర్తిలో విత్తనాలు కొనుగోలు చేసి తీసుకు వచ్చాం. పది ఎకరాలకు 9 క్వింటాళ్ల విత్తనం ఉపయోగించాం. ఇప్పటి వరకు రూ.2.50 లక్షలు పెట్టుబడి అయ్యింది. ఇటీవల తెగుళ్ల సోకగా సస్యరక్షణ చర్యలు చేపట్టాం. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది.

-రూపం వెంకట్‌రెడ్డి, రైతు, చింతలపల్లి

వరికి ప్రత్యామ్నాయంగా..



మార్కెట్‌లో వేరుశనగకు డిమాండ్ ఉండడంతో వరికి ప్రత్యామ్నాయంగా నాలుగు ఎకరాలలో సాగు చేశా. గతేడాది మొక్కజొన్న పంట వేశా. వ్యవసాయ అధికారుల సూచన మేరకు పంట మార్పిడి చేసి యాసంగిలో వేరుశనగ పంట వేశాను.పెట్టుబడి ఎక్కువైనా వచ్చే దిగుబడితో ఆదాయం తెచ్చిపెడుతుందని చాలా మంది రైతులు వేరుశన సాగు చేశారు.

-నేజ్యనాయక్, రైతు, కొండ్రిగాని బోడు తండా

వేరుశనగతో అధిక లాభాలు



మేలు రకం విత్తనాలు ఎంచుకొని సస్య రక్షణ చర్యలు పాటిస్తే వేరుశనగ పంటలో అధిక దిగుబడి పొంది లాభాలు గడించవచ్చు. తక్కువ నీటితో ఎక్కువ పంటసాగు చేసుకోవచ్చు. ఈ ఏడాది యాసంగిలో వేరుశనగ సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. రైతులు తెగుళ్ల నివారణకు తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.

- శ్రీనివాస్ గౌడ్, ఏవో, ఆమనగల్లు

'సూదిని'కి కార్పొరేషన్ పదవి!

చైర్మన్ పదవికి రాంరెడ్డి పేరు పరిశీలన



ఆమనగల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. డిసెంబర్ మొదటి వారంలో భర్తీచేసే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లలో ఆయనకు అవకాశం కల్పిస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్ చైర్మన్‌గా రాంరెడ్డికి అవకాశం కల్పించాలని నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో దశాబ్దాలుగా రాంరెడ్డి పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించాలని కొందరు నేతలు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరినట్లు సమాచారం. రాజకీయాల్లో సౌమ్యుడిగా పేరున్న ఆయనకుసీఎం తో బంధుత్వం ఉంది. ఆయన పేరును స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవి ఇప్పటికే ప్రతిపాదించి ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు తెలిసింది.

అభివృద్ధికి సహకరించాలి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ) నిధులు సకాలంలో అందించి ఆరోగ్యం, విద్యకు తోడ్పాటును అందించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పారిశ్రామికవేత్తలను కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయలు, ఫర్నిచర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులలో అవసరమైన వసతుల కల్పనకు సహకరించాలన్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో సీఎస్ఆర్ కింద సహకారం అందిస్తున్న పారిశ్రామిక వేత్తలందరినీ అదనపు కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ప్రధాన పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న లింగ్యానాయక్

తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కులకచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో వాసుచంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. తూకంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గన్నీ బస్తాల కొరత లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌లో హోంగార్డు ఆత్మహత్యాయత్నం

భూ వివాదంలో న్యాయం జరగలేదని మనస్థాపం
సీఐ ఎదుటే డీజిల్ పోసుకొని హల్‌చల్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన ఓ హోంగార్డు ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ అనుబంధ గ్రామం కొత్తగూడానికి చెందిన మహ్మద్ ఘనీ(39) చర్లపల్లి పీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 258, 268లలో 30 గుంటల భూమి వారసత్వంగా సంక్రమించింది. ఆ భూమి చుట్టు ప్రహరీ నిర్మిస్తుండగా, ఘనీ దాయాదులు అఫ్జల్, జబ్బార్ ఆ భూమిలో తమకు వాటా వస్తుందని ప్రహరీ పనులను అడ్డుకున్నారు. దీంతో ఘనీ ఈనెల 26న ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు సీఐ పరుశురాం ఇరువర్గాలను పిలిచి కోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప అడ్డుకోవడానికి లేదని ప్రత్యర్థులకు చెప్పి పంపించాడు. మరుసటి రోజు ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా అఫ్జల్, జబ్బార్‌లు మళ్లీ అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని మనస్తాపానికిగురైన ఘనీ డీజిల్ బాటిల్‌ను బ్యాగ్‌లో పెట్టుకొని పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. సీఐ చాంబర్‌లోకి వెళ్లి ఆయన ఎదుటే డీజిల్ ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తేరుకున్న సీఐ, పోలీసు సిబ్బంది ఘనీ చేతిలోని బాటిల్‌ను లాక్కున్నారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘనీకి ఏమీ కాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మూతబడిన ఇరికుంట తండా పాఠశాల

» 40 రోజులుగా రాని ఉపాధ్యాయుడు



శంకర్‌పల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇరికుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతబడింది. సుమారు 40 రోజుల నుంచి పాఠశాలకు ఉపాధ్యాయుడు రాకపోవడంతో, విద్యార్థులకు పాఠాలు చెప్పే దిక్కులేదు. 2024 డీఎస్సీలో ఉపాధ్యాయుడుగా ఎంపికైన బర్కమ్ శ్రీశైలం అక్టోబరు 16న ఎంఈఓ కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరాడు. అయితే ఆయనకు దృష్టి లోపం ఉండటంతో తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వెళ్లాడు. ఏమైందో తెలియదు కాని పాఠశాలను చూసిన మరునాడు నుంచి పాఠశాలకు రావడం లేదు. అప్పటి నుంచి పాఠశాలను ఎవరూ తెరిచే దిక్కులేకుండా పోయింది. ఇంతకు ముందు చేవెళ్ల మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడి (డిప్యుటేషన్)తో ఈ పాఠశాల నడిచేది.

సమాచారం లేకుండా గైర్హాజరు

ఈ విషయమై ఎంఈఓ అక్బర్‌ను వివరణ కోరగా ఉపాధ్యాయుడు శ్రీశైలం విధుల్లో చేరిన మరుసటి రోజు నుంచి రావడం లేదు. ఎలాంటి అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరు అవుతున్నాడు. అక్కడ ఉండే ఐదుగురు పిల్లలను దొంతాన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నాం.


డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న డీపీవో సురేశ్‌మోహన్

డాటా ఎంట్రీలో తప్పులు ఉండొద్దు

» జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్

కొత్తూర్, నవంబర్ 27:(ఆంధ్రజ్యోతి): కులగణనకు సంబంధించి డాటాను తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ ఆపరేటర్లకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంతో పాటు మండల పరిధిలోని గుడూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న డాటా ఎంట్రీ ప్రోగ్రామ్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాటా ఎంట్రీలో తప్పులు లేకుండా పరిశీలించి చేయాలన్నారు. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని ప్రోగ్రామ్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ అరుంధతీ, ఎంపీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, గ్రామ కార్యదర్శి సురేందర్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కాలుష్యకారక కంపెనీల ఏర్పాటు వద్దు

» పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్

వికారాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాలుష్యకారక ఇథనాల్, ఫార్మా కంపెనీల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్ చేసింది. ప్రభుత్వాలు రాష్ట్ర మౌలిక లక్ష్యాలను గాలికి వదిలేసి రైతాంగాన్ని, పర్యావరణాన్ని బలి తీసుకునే రాజకీయార్థిక విధానాలను అమలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి, గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా లేనే లేదన్నారు. అన్ని పార్టీలు కార్పొరేట్ల కోసమే పని చేస్తున్నాయని ఆ వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో విమర్శించారు. నూతన ఆర్థిక విధానాల పేరున బహుళ జాతి కంపెనీలు దేశ విదేశ కార్పొరేట్ పెట్టుబడుల ప్రయోజనాకు అనుగుణమైన విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్నాయన్నారు. అప్పటి నుంచి రైతులు భూములు కోల్పోతూ నిర్వాసితులుగా మారిపోవడం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

కార్పొరేట్ విధానాలకు లొంగొద్దు

కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ పాలసీ తీసుకు వచ్చి ఆ కంపెనీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకువస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో 30 ఇథనాల్ కంపెనీలు రాబోతున్నాయని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ధన్వాడలో, దిలావర్‌పూర్‌లో ఇథనాల్ కంపెనీల ఏర్పాటును ప్రోత్సహిస్తోందన్నారు. లగచర్ల ఫార్మా కంపెనీల మాదిరిగా రాష్ట్రంలో 20కి పైగానే ఫార్మా కంపెనీలు రాబోతున్నాయన్నారు. ఆయా కంపెనీల రాకతో తెలంగాణ భూములు కలుషితమవుతాయన్నారు. ప్రజలు రోగాల బారిన పడతారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని కేంద్ర విధానాలకు కార్పొరేట్లకు లొంగకుండా ఇథనాల్, ఫార్మాకంపెనీల ఏర్పాటుకు పాలసీని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

డిసెంబర్ 5వరకు రీసెర్చ్ మెథడాలజీ తరగతులు

» ఓయూలో ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహణ
» శామీర్‌పేట ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి


మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాసమూర్తి

శామీర్‌పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైస్(ఐపీఈ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్‌లో నవంబరు 25న ప్రారంభమైన గుణాత్మక, పరిమాణాత్మక పరిశోధన (రీసెర్చ్ మెథడాలాజీ) కోర్సు డిసెంబర్ 5 వరకు 10 రోజుల పాటు ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. బుధవారం శామీర్‌పేటలోని ఐపీఈ క్యాంపస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మీడియాకు వెల్లడించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో అప్లికేషన్ ఆఫ్ ఇన్నోవేటివ్ టూల్స్ అండ్ టెక్నిక్స్ పేరుతో సమగ్రంగా 10 రోజుల పాటు ఆఫ్‌లైన్‌లో ఈ కోర్సును ఐపీఈ నిర్వహించనున్నట్లు వివరించారు. పరిశోధనా అనేది సవాళ్లను అధిగమించడానికి, సంకల్పం, నిర్మాణాత్మక విధానం అవసరమయ్యే ప్రయాణమన్నారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం మాట్లాడుతూ నవంబరు 25న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో రిసెర్చ్ మెథడాలాజీ కోర్సు సెషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఐపీఈ ప్రొగ్రామ్ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీధర్‌రాజ్ మాట్లాడుతూ ప్రత్యేకమైన రీచర్చ్ మెథడాలాజీ కోర్సు పరిశోధకులకు అవసరమైన సాధనాలు, సాంకేతికతలతో వారి విద్యాపరమైన దృఢత్వాన్ని మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుందన్నారు.

ఫ్లైఓవర్‌ను పొడిగించండి

» రైల్వే డీఆర్ఎంకు వినతి

కొత్తూర్, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌లోని ఫ్లైఓవర్‌ను పొడగించాలని కోరుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ జోలీ రవీందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేశ్‌విష్ణుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఇందుకు డీఆర్ఎం సానుకూలంగా స్పందించారని రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పసుపుల సుధాకర్, బూరుగుల సురేశ్, సత్యనారాయణ, జోలీ రాజు, ప్రకాష్‌గౌడ్, మొగిలిద్ద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టొద్దు

» జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

శామీర్‌పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల, మాదిగల మధ్య వైశమ్యాలను తీసుకురావద్దని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మండిపడ్డారు. మాలలపై జరుగుతున్న అసత్య ప్రచారం, అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహా పాదయాత్ర బుధవారం శామీర్‌పేటకు చేరుకుంది. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ శామీర్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణ, మాలల పై చేస్తున్న అసత్య ప్రచారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని హెచ్చరించారు. రాజ్యాధికారం కోసం పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ రాసిచ్చిన స్లిప్పును న్యాయమూర్తులు చదివి దళితుల మధ్య అనైక్యత తీసుక వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు చిప్పల నర్సింగ్‌రావు, జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, దళిత సేన నాయకులు మురళీకృష్ణ, వజ్జేల మురళీ, నీరుడి బాలేష్ పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

మహేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబరు 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగబోయే తెలంగాణ మాలల సింహ గర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ అన్నారు. బుధవారం తుక్కుగూడలో మాల మహానాడు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో 30 సంవత్సరాలుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందక పాలకులు తీరని అన్యాయం చేశారన్నారు. మనువాద మందకృష్ణ మాటలు నమ్మి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మాలలను అనేక రకాలుగా నిర్లక్ష్యానికి గురి చేశాయన్నారు. కార్యక్రమంలో మండల మాల మమానాడు నాయకులు ఏకుల రాములు, పెంటమల్ల సురేశ్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

తూంకుంట నుంచి మందాయిపల్లికి నాలుగు లేన్ల రోడ్డు మంజూరు

» రూ.6.5 కోట్ల నిధులను మంజూరు చేసిన ప్రభుత్వం

శామీర్‌పేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట మండలం తూంకుంట నుంచి మందాయిపల్లి వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్‌తో నాలుగు లేన్ల బీటీ రోడ్డును ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిందని, తూంకుంట మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ ఉమాఅంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 6.5 కోట్ల నిధులను మంజూరి చేసిందని, అలాగే వర్క్ టెండర్ ప్రాసెస్‌ను కూడా పూర్తి చేసిందని తెలిపారు. త్వరలో ఈ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు కౌన్సిలర్ తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి


రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్

శంకర్‌పల్లి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, మసీదులు, చర్చీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ సూచించారు. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్‌తో కలిసి ఆయన బుధవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేసులను వేగవంతంగా, పరిశోధనాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. వంద మంది పోలీసులకు ఒక సీసీ కెమెరా సమానమని అన్నారు. తప్పని సరిగా ప్రార్థనా స్థలాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రైల్వేస్టేషన్ల అభివృద్ధికి సహకరించండి

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


రైల్వే మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఈటల

మేడ్చల్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లాలోని రైల్వే స్టేషన్లను సమగ్రంగా అభివృద్ధి పరచాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. మేడ్చల్ రైల్వేస్టేషన్ అధునీకరణ, రైల్వే అండర్ పాస్ పనులు త్వరగా పూర్తి చేయించడంతో పాటు, మేడ్చల్ గండిమైసమ్మ మధ్య ఉన్న రైల్వేలైన్ వద్ద వంతెన ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పెండింగ్ బిల్లులు చెల్లించండి

యాచారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన నాలుగు నెలల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని యాచారం మండల మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకులు చందూనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్వో భవన్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రమిచ్చారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

యాచారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బాబు తెలిపారు. అధ్యక్షుడిగా మూలి మహేష్, అధికార ప్రతినిధిగా మస్కు యాదగిరి, ఉపాధ్యక్షుడిగా మంద లింగం, ప్రధాన కార్యదర్శిగా కె.కొండల్, కార్యదర్శి, సహాయ కార్యదర్శులుగా కొమ్ము విక్రం, మస్కు శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

రోడ్డుపైనే మురుగు

- కల్వర్టుకు అడ్డంగా రాళ్లు.. మ్యాన్‌హోల్ ద్వారా బయటకు మురుగు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు
- హిమాయత్‌నగర్‌లో అస్తవ్యస్తంగా పారిశుధ్య వ్యవస్థ


మ్యాన్‌హోల్ నుంచి రోడ్డుపైకి వస్తున్న మురుగు నీరు

మొయినాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై మురుగు నీరు పారుతుండటంతో మండల పరిధిలోని హిమాయత్ నగర్ రోడ్డు అధ్వానంగా మారింది. పట్టించుకోవాల్సిన అధికారులు కనీసనం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో రోడ్డుపైనే మురుగు నిలుస్తోంది. దాంతో దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయి. రోగాలు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, నిత్యం హిమాయత్ నగర్ గ్రామస్థులు, చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే భక్తులు ఈ రోడ్డు నుంచే వెళుతుంటారు. మురుగు నిలుస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. కుమ్మరి బస్తీ, ఇతర కాలనీల్లో మురుగు సక్రమంగా వెళ్లేందుకు హిమాయత్‌నగర్ ప్రధాన రోడ్డుపై కల్వర్టును ఏర్పాటుచేసి కుమ్మరి కుంటకు మళ్లించేవారు. అక్కడి నుంచి గండిపేట చెరువు బూరుకుంటలోకి మురుగు నీరు వెళ్లేలా చిన్న పిల్లకాలువ ఉండేది. అయితే, ప్రధాన రోడ్డుపై ఉన్న కల్వర్టులో కొందరు పెద్దపెద్ద రాళ్లు వేసి మూసివేశారు. దాంతో మురుగు నీరు కాలువలోకి వెళ్లకుండా తిరిగి మ్యాన్‌హోల్ ద్వారా రోడ్డుపైకి వస్తోంది. ఈ మురుగు నీటితో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విష పురుగులు సంచరిస్తున్నాయని భయాందోళనకు గురౌతున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

బోరులో నుంచి మురుగు నీరు వస్తోంది



హిమాయత్ నగర్‌లో సాయిబాబా గుడి వద్ద మురుగు నీరు రోడ్డుపై పారుతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కల్వర్టు వద్ద మురుగు నీరు వెళ్లే పైపులో కొందరు రాళ్లను వేయడంతో నీరంతా అక్కడే నిలిచి పోతోంది. మా ఇంటి పరిసరాలు అస్తవ్యస్థంగా మారాయి. తాగునీటి బోరులో నుంచి మురుగు నీరు వస్తోంది. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

\- కుమ్మరి రవికుమార్, హిమాయత్‌నగర్ గ్రామం


చెన్నారెడ్డిగూడలో సభ్యత్వాలు చేయిస్తున్న నాయకులు

తెలుగుదేశం పార్టీతోనే బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం

మంచాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం కల్గించిన ఘనత టీడీపీకే దక్కిందని ఆ పార్టీ రాష్ట్రనేత సీహెచ్ చక్రపాణి అన్నారు. మంచాల మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉమ్మడి రాష్ట్ర అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు యార మహేందర్, వంగాల కృష్ణ, జక్క రాంరెడ్డి, కొంగర వెంకట్‌రెడ్డి, ఆనంద్, వేణుయాదవ్, అజీమ్, మల్లేష్, శ్రీరాం హన్మంతు, దర్శన్, రాములు, వీరాచారి, రాజు, భద్రయ్య, ఇబ్రహీం, మంగళారం రాములు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యసేవలు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్ది రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, చారగొండ మండలాలకు చెందిన పలువురు లబ్దిదారులకు రూ.3.60 లక్షలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నాయకులు జక్కు అనంత రెడ్డి, నిట్ట నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మెకానిక్ బాబా, విజయ్‌రాథోడ్, జగన్, వెంకట్, సత్యం, తావు, హర్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన రవాణా కల్పించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్
- రూ.18 కోట్లతో చేపట్టే వంద ఫీట్ల రోడ్డుకు శంకుస్థాపన


రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని పద్మావతి గార్డెన్ నుంచి నర్కూడ వరకు రూ.18 కోట్లతో చేపట్టే 100 ఫీట్ల బీటీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో అధిక నిధులు కేటాయిస్తోందని చెప్పారు. శంషాబాద్ సమీపంలోని అనేక పరిశ్రమలు ఉన్నాయని, వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రభుత్వం ప్రతీ గ్రామానికి బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం దిశగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అలాగే ప్రతీ గ్రామానికి రోడ్డు, బస్సు సౌకర్యం కల్పిస్తామని, రామంజాపూర్ నుంచి శంషాబాద్ బస్టాండ్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కొందరు ప్రాణాలు కోల్పోయారని, వంద ఫీట్ల రోడ్డుగా విస్తరిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు అశోక్, వెంకటేష్, జహంగీర్‌ఖాన్, నాయకులు పారేపల్లి శ్రీనివాస్ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయభేరి మోగిద్దాం

- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్, నవంబరు 27: వచ్చే స్థానిక ఎన్నికల్లో విజయభేరి మోగించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈనెల 29న నిర్వహించబోయే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజాసేవకు అంకితం కావాలని సూచించారు. మున్ముందు రోజుల్లో బీఆర్ఎస్‌దే అధికారమన్న విషయాన్ని పార్టీ శ్రేణులు విస్మరించరాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఈ విషయాన్ని ప్రతీ కార్యకర్త ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతు భరోసా, తులం బంగారం, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, బకాయిలాంటి వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

సామాజిక న్యాయమే కాంగ్రెస్ ధ్యేయం


కాంగ్రెస్ నేతలతో చల్లా వంశీచంద్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, సమానత్వమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టిందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బుధవారం తుక్కుగూడ వద్ద ఆయన్ను కలిశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, పార్టీ బలోపేతం తదితర విషయాలపై చర్చించారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ, రమేశ్, శ్రీను, కృష్ణనాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీనర్సింహరెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న సిక్కిం రాష్ట్ర బృందం

సిక్కిం బృందంతో జీఎల్ఎన్ రెడ్డి భేటీ

కడ్తాల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని సిక్కిం గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధుల బృందం కితాబు ఇచ్చినట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి చెప్పారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం సిక్కిం సర్పంచ్‌ల బృందం సభ్యులతో ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో సమావేశమైనట్లు పేర్కొన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనుల గూర్చి బృందానికి వివరించినట్లు ఆయన చెప్పారు.

రైతుమేళాకు తరలిరావాలి

కేశంపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించే రైతు మేళా కార్యక్రమానికి మండల రైతులు తరలిరావాలని మండల వ్యవసాయాధికారి శిరీష ప్రకటనలో తెలిపారు. 29న కేశంపేట నుంచి రెండు బస్సుల్లో వెళ్లేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

'సర్వే'త్రా నిరీక్షణ!

(5వ పేజీ తరువాయి)

విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ మూడు మండలాల్లో సర్వేయర్లుగా పనిచేస్తున్నారు.

కొత్త నియామకాల్లేవ్..

మండల వ్యవస్థ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు కొత్తగా సర్వేయర్లను నియామకం చేపట్టక పోవడంతో సర్వే సమస్య తలెత్తుతోంది. చైన్‌మెన్లు, సర్వేర్లు, సీనియర్ సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు, ఇనెస్పెక్టర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. గతంలో ప్రభుత్వ భూములు కొలిచేందుకు ప్రత్యేక సర్వేయర్లు ఉండేవారు. వారు రిటైర్డ్ కావడంతో కొత్తవారిని తీసుకోలేదు.

జిల్లాలోనే ఎందుకు ఇలా?

మేడ్చల్ జిల్లాలో 15 మండలాలు ఉంటే.. 18 మంది సర్వేయర్లు ఉన్నారు. హైదరాబాద్ జిల్లాలో కూడా 16 మండలాలకు గాను 19 మంది సర్వేయర్లు ఉన్నారు. కానీ.. రంగారెడ్డి జిల్లాలో మాత్రం 27 మండలాలకు 14 మంది సర్వేయర్లు ఉన్నారు. సర్వేయర్ల కొరత, తలెత్తుతున్న సమస్యలను ముందే గుర్తించి ప్రభుత్వానికి తగిన నివేదిక ఇవ్వాల్సిన జిల్లా స్థాయి అధికారులు ఎందుకు ప్రభుత్వానికి నివేదించటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఘర్షణకు దారి తీస్తున్న వివాదాలు

దశాబ్దకాలంగా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో భూ క్రయ, విక్రయాలు పెరిగిపోయాయి. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత దస్త్రాలు, భూ కొలతల్లో చాలా వ్యత్యాసాలు వస్తున్నాయి. కమతాల హద్దుల పక్కనే ఉన్న రైతుల మధ్య వివాదాలు ప్రారంభమై ఘర్షణలకు దారి తీస్తుంది. దీంతో సర్వే చేయాలంటూ రెవెన్యూ, భూ కొలతల శాఖ అధికారులకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు.

పెండింగ్‌లో వేల దరఖాస్తులు..

జిల్లాలో సర్వే కోసం ఇప్పటి వరకు 2,688 దరఖాస్తులు రాగా అందులో 448 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. మిగతావి పెండింగ్‌లోనే ఉన్నాయి. రైతుల దరఖాస్తులతో పాటు జాతీయ రహదారుల కోసం భూసేకరణతో ఉన్న సర్వేయర్లపై పని భారం పెరుగుతుంది. సాంకేతిక పరికరాలు కూడా అందుబాటులో లేకపోవడంతో సర్వే ఆలస్యమవుతోంది.

జిల్లా ఆఫీసులో వెక్కిరిస్తున్న ఖాళీ పోస్టులు

జిల్లా సర్వే కార్యాలయంలో ఉద్యోగుల కొరత కారణంగా ఇబ్బందులు తప్పటం లేదు. 30 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 18 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండల స్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయిలోని అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కార్యాలయంలో కూడ ఇదే పరిస్థితి ఉంది. వీరు పూర్తిగా మండల సర్వేయర్లపైనే ఆధారపడుతున్నారు. ఏడీ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉండాలి. మండల స్థాయిలో పరిష్కారం కాని వివాదాస్పద భూముల సర్వేకు అధికంగా ఫిర్యాదులు ఏడీ వద్దకు వస్తున్నాయి. ఇన్‌స్పెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి రిపోర్టు ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో ఇన్‌స్పెక్టర్లు లేకపోవడంతో వారు చేయాల్సిన పనులు సైతం ఏడీ చూసుకోవాల్సి వస్తుంది.

చేయి తడిపితేనే పని..

భూసర్వేకు చేతులు తడపితే పనవుతుంది. నిబంధనలు మాట్లాడితే కొర్రీలు పెడుతున్నారు. ఇప్పుడే మీభూమి సర్వే చేయలేం.. మీకంటేముందు చలానాలు చెల్లించిన వారు ఉన్నారు అంటూ బుకాయిస్తున్నారు. సిబ్బంది కొరత, టిపన్లు అందుబాటులో లేవని తప్పించుకుంటున్నారు. పైరవీకారులు చెబితే ఒకట్రెండు రోజుల్లో సర్వే పూర్తిచేస్తున్నారు. భూవిస్తీర్ణాన్ని బట్టి ఎంతివ్వాలో చెబుతున్నారు. సర్వే సక్రమంగా పూర్తయితే తుది నివేదికకు మళ్లీ చేయి తడపాల్సిందే. లేదంటే కొర్రీలు పెడుతున్నారు.

ఎప్పటికప్పుడు కొలతలు వేస్తున్నాం..



మీసేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. సర్వేయర్ల కొరత కారణంగా కొంత ఆలస్యం జరుగుతోంది. అయితే, ఒక సర్వేయర్‌కు రెండు మండలాలను అప్పగించడంతో పనిభారం పెరిగింది.

\- కె.శ్రీనివాసులు, సర్వే ల్యాండ్ అసిస్టెంట్ డైరెక్టర్

పలుకుబడి ఉంటేనే పని



డబ్బు, పలుకుబడి ఉన్నవారి పని చకచకా జరిగిపోతే.. పేదల పని నెలలతరబడి ఆగుతోంది. సర్వేకోసం 8నెలల క్రితం దరఖాస్తు చేసుకున్న.. మా మండలంలో పర్మినెంట్ సర్వేయర్ లేకపోవడంతో నిరీక్షించాల్సి వస్తుంది.

\- పసుల నర్సింహయాదవ్, కొత్తపేట, కేశంపేట మండలం

ఆరు నెలలుగా ఎదురు చూస్తున్న



ఆరు నెలల క్రితం భూమి సర్వే కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాను. ఇప్పటి వరకు సర్వేయర్ రాలేదు. పలు మార్లు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లినా సర్వేయర్ కనిపించడం లేదు.

\- గొల్ల నర్సింహులు, చౌదరిగూడ

మెనూ ప్రకారం భోజనం అందించాలి


కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మహేశ్వరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల అభివృద్ధి అధికారి శైలజా రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కేజీబీవీ వసతిగృహంతో పాటు పలు పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చదువుకోసం ప్రతియేటా కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తుందని, కార్మికుల నిర్లక్ష్యంతో భోజనంలో నాణ్యత లోపిస్తోందని, మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొగిలిగిద్ద సమీపంలో పరిగి రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. ఎల్లంపల్లికి చెందిన పర్వతయ్య(55) షాబాద్ మండలం కక్కులూరులో జరిగిన బంధువుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లి తిరిగి సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మొగిలిగిద్ద సమీపంలోని పెట్రోల్ బంక్ ముందు నుంచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ సైకిల్‌ను ఢీకొంది. పర్వతయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్ రూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వేగేట్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం..రైల్వేగేట్ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో రవి అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనాయి. యమ్మి హోటల్‌లో పని చేస్తున్న అతడు ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

శంషాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన బుధవారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్సై మహ్మద్ అర్షద్ అలీ కథనం మేరకు.. మున్సిపల్ పరిధిలోని వీకార్‌సెక్షన్ కాలనీకి చెందిన కొత్తగొల్ల సౌందర్య ఈనెల 26న ఇంటి నుంచి తాను పనిచేసే ఆఫీస్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తండ్రి రాజు ఆమె పనిచేసే ఆఫీస్ వద్దకు వెళ్లి ఆరాతీయగా తాను ఉదయం నుంచి రాలేదని అక్కడున్నవారు చెప్పారు. దాంతో సిబ్బంది, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి రాజు ఫిర్యాదు చేశాడు.

అక్రమ నల్లా కనెక్షన్లు.. ఏడుగురిపై కేసు

శంషాబాద్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అక్రమ నల్లా కలెక్షన్ కలిగిన ఏడుగురిపై కేసు నమోదు చేసిన ఘటన బుధవారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహ్మద్ అర్షద్ అలీ కథనం మేరకు.. శంషాబాద్ పట్టణంలోని కుమ్మరి బస్తీకి చెందిన బి.రవి, బి.కృష్ణ, బి.కుమార్, బి.అంజయ్య మహబూబ్ బీ, కె.బాల్‌రాజ్, టి.భాస్కర్‌లు మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఇంటింటికీ నల్లా కనెక్షన్ తీసుకున్నారు. అయితే, వీరంతా రెండు నల్లాలతో పాటు బోరు మోటర్లతో నీళ్లను అక్రమంగా వాడుకుంటున్నారు. గతంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు పలుమార్లు హెచ్చరించినా వినలేదు. ఈ నెల 26న ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా.. నల్లాలకు బోరు మోటర్ పెట్టడం, ఒక కనెక్షన్ తీసుకుని రెండు నల్లాలు వాటడం.. ఒక నల్లా బిల్లు మాత్రమే చెల్లిస్తున్నట్లు గుర్తించిన హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు శ్రేయస్సుకు పాటుపడాలి


ఎమ్మెల్యే వంశీకృష్ణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గీత

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రభుత్వానికి మధ్య మార్కెట్ పాలక వర్గం వారధిగా పనిచేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన యాట గీతా నర్సింహ బుధవారం వంశీకృష్ణను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. గీతను ఎమ్మెల్యే అభినందించారు. ప్రభుత్వ రైతు సంక్షేమ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

మోసపూరిత హామీలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్


మాట్లాడుతున్న కుమార్ యాదవ్

చేవెళ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాది పాలన పూర్తవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతోందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం బీజేవైఎం చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని, రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకనే ప్రజాపాలన దరఖాస్తులు, హైడ్రా, కుటుంబ సమగ్ర సర్వే తదితర వాటితో కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది దరిద్ర పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు డిసెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు ప్రతీ మండల కేంద్రంలో బైక్ ర్యాలీలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ట్రైనింగ్ సెల్ కన్వీనర్ సుజేంద్రశర్మ, చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి ఎం. మధుకర్‌రెడ్డి, మొయినాబాద్, షాబాద్ మండలాధ్యక్షులు శ్రీకాంత్, మహేశ్, చేవెళ్ల టౌన్ అధ్యక్షుడు శ్రీతంరెడ్డి, నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

27వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. 9 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 27వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, పలువురు యువకులు దీక్షలో కూర్చున్నారు. సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు అశోక్‌గౌడ్, శరత్ చంద్ర, అంజనేయులు, మల్లయ్య, రాజునాయక్, రాంచంద్రయ్య, కృష్ణయ్య, గౌస్, మైసయ్య, జంగయ్య, హుస్సేన్, తిరుపతయ్య పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం


ఆపరేషన్లు చేయించుకున్న వారితో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమం, కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో 9 రోజులపాటు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరం బుధవారం సాయంత్రం ముగిసింది. రాఘవేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిబిరంలో వైద్య సేవలు, కంటి చికిత్సలు అందించిన చెన్నై శంకరన్ నేత్రాలయ వైద్యులు, సిబ్బందిని సత్కరించి అభినందించారు. కంటి చికిత్సలు, పరీక్షలు చేయించుకున్న వారితో ఆయన సమావేశమై శిబిరం నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. మెగా వైద్య శిబిరం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన 4 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2,800 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందించినట్లు వివరించారు. కంటి శుక్లాలు ఉన్న 150 మందికి కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. టాస్క్ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి, ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. శంకరన్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ శంకర్, డాక్టర్ ఆస్తా, రాజు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు కేటీఆర్ ఆశీర్వాదం



ఆమనగల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మంజుల దంపతుల కుమారుడు డాక్టర్ అనిల్‌కుమార్, భావన వివాహ వేడుక బుధవారం నగర శివారులోని మన్నెగూడ బీఎంఆర్ పార్థ కన్వెన్షన్‌లో జరిగింది. కేటీఆర్, హరీష్‌రావు, సబితారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డిలతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర, జిల్లాల నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

సంక్షిప్తంగా

- **ఆమనగల్లు** : రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని ఆమె సూచించినట్లు నర్సింహ చెప్పారు.
- **తలకొండపల్లి** : స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు, యువత ముందుకు సాగాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరామ్, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్(బాలుర)లో ఏబీవీపీ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించారు. ఏబీవీపీ, బీజేవైఎం నాయకులతో కలిసి వారు క్రీడలను ప్రారంభించారు. మండల పరిధిలోని 12పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.
- **కేశంపేట** : ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో విద్యార్థులకు పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆంగ్ల మాధ్యమంలో పాపిరెడ్డిగూడ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కె.అర్చన ప్రథమ స్థానంలో నిలిచింది. తెలుగు మాధ్యమంలో జడ్పీహెచ్ఎస్ కొత్తపేట విద్యార్థి ధనుష్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇన్‌చార్జీ ఎంఈవో చంద్రశేఖర్, హెచ్ఎం విద్యావతి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.
- **కందుకూరు** : మండలంలోని గ్రామాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో పునరుత్పాదక శక్తివనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారిని మండల విద్యాధికారి హెచ్.నర్సింహ అభినందించారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు కరికులర్ యాక్టివిటీస్‌లో ముందుండాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు, సీఆర్పీ వెంకటేష్ ఉన్నారు.